

వానల్‌పాడ్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



కామోల్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం

# ప్రభుత్వ దవాఖాన @కార్పొరేట్ వైద్యం

- పేదల ఆరోగ్య పరిరక్షణే సర్కారు ధ్యేయం
- మౌలిక వసతులకు పెద్దపీట
- ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో 50కి పైగా వైద్య పరీక్షలు
- మండలంలో ఏడు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు
- ప్రభుత్వ వైద్యంపై ప్రజల ఆసక్తి



మహాగాంలో రూ. 2 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భైంసాటౌన్, అక్టోబర్ 22 : సర్కారు వైద్యశాలల్లో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం. స్వరాష్ట్రంలో పేదలకు అత్యుత్తమ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి పాలనలో సౌకర్యాలు లేక కూనారిల్లిన ప్రభుత్వ దవాఖానలను స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బలోపేతం చేస్తున్నది. మౌలిక సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ అత్యుత్తమ వైద్యం అందిస్తుండడంతో ప్రభుత్వ దవాఖానల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆశ కార్యకర్తలు గర్భిణులను కంటికి రెప్పలా కాపాడుతూ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. మండలంలోని మహాగాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏడు ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రైవేటు వైద్యశాలల్లో వేలాది రూపాయలకు లభించే వైద్య సేవలు ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగానే లభిస్తున్నాయి. మీర్జాపూర్, దేగాం, కామోల్, పిప్రికాలనీ, ఎగ్గాం, వానల్‌పాడ్, మహాగాం ఆరోగ్య ఉప కేంద్రాలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉన్నాయి. మొత్తం 50 కి పైగా వైద్య పరీక్షలు చేస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, డెంగీ, మూత్ర పరీక్షలు, షుగర్, రక్త తదితర పరీక్షలన్నీ ఉచితంగా లభిస్తున్నాయి. వైద్యశాలకు వచ్చే వారికే కాక ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా బీపీ, షుగర్ రోగులకు వారి ఇంటి వద్దే మందులను అందిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పు చేయించుకున్న మహిళలకు కేసీఆర్ కిట్స్ అందిస్తున్నారు. అందులో చంటి పిల్లలకు అవసరమైన వివిధ రకాల వస్తువులను ఇస్తున్నారు. ఇదే ప్రైవేటు వైద్య శాలలో ప్రసవం జరిగితే కనీసం రూ. 20 వేల నుంచి 50 వేల వరకు ఖర్చవుతుంది. ఇక కేసీఆర్ కిట్‌తో పాటు ఆడ బిడ్డ పుడితో రూ. 13 వేలు, మగ బిడ్డ పుడితే రూ. 12 వేల చొప్పున పారి తోషికంగా అందిస్తున్నారు. ఇక ప్రతీ మంగళవారం మహిళలకు ఆరోగ్యమహిళా కార్యక్రమం ద్వారా 8 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు.

### మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం..



పీహెచ్‌సీలో 50కి పైగా వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నాం. అన్ని సబ్ సెంటర్లలోనూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. మందులు పూర్తి స్థాయిలో అందిస్తున్నాం. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరా లను నిర్వహిస్తున్నాం. వైరల్ జ్వరాల నివారణకు చర్యలు చేపడుతున్నాం.

**- శ్రీకాంత్, మహాగాం పీహెచ్‌సీ వైద్యాధికారి**



ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



చించాలలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# అభివృద్ధిని చూసి ఆదరించండి

ముథోల్, అక్టోబర్ 22 : అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని ముథోల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం చించాల, వెంకటాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. తమ ఓటును ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి వేసి మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఎంపీటీసీ గంగాధర్, విట్టోలి తండా సర్పంచ్ విజేశ్, నాయకులు వంశీ, కిష్టయ్య, జైభీంతో పాటు నాయకులు కానోళ్ల రవి, వెంకటాపూర్ సర్పంచ్ సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

# భజన కళాకారులకు సన్మానం



కళాకారులను సత్కరించిన యువకులు

కుభీర్, అక్టోబర్ 22 : కుభీర్‌లోని జైశ్రీరాం నగర్‌లో గల ధనేశ్వరాలయంలో యువ తరంగ్ యూత్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దుర్గామాత సన్నిధిలో మహారాష్ట్రలోని కాండ్లి గ్రామానికి చెందిన సాంప్రదాయ సంగీత భజన కళాకారులు అమ్మవారి పాటలతో ఉర్రూతలూగించారు. వారిని యువ జన సంఘం సభ్యులు సత్కరించారు.

# ఘనంగా కుమ్రం భీం జయంతి



లోకేశ్వరం : కుమ్రంభీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయక్‌పోడ్ కులస్తులు

లోకేశ్వరం, అక్టోబర్ 22 : జోహర్‌పూర్‌లో ఆదివారం కుమ్రంభీం జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిగంబర్, ఉప సర్పంచ్ భోజన్న, సుదాన్, గంగన్న, సాయి, నాయక్‌పోడ్ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తానూర్‌లో..**

తానూర్, అక్టోబర్ 22 : మొగిలి గ్రామంలో కుమ్రంభీం జయంతిని నిర్వహించారు. కుమ్రం భీం చిత్రపటానికి సర్పంచ్ పుండ్లిక్, ఎంపీటీసీ సిరిమొల్ల లక్ష్మణ్ పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ లచ్చన్న, కారోబార్ భుజంగ్‌సింగ్, పడకంటి మోహన్, బాబు పటేల్, నాగ్‌నాథ్, దర్శన్, బాలోడ్ సాయినాథ్, అనిల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



తానూర్ : మొగిలిలో జరిగిన కుమ్రంభీం జయంతిలో పాల్గొన్న గ్రామస్తులు

## కనులపండువగా బతుకమ్మ వేడుకలు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 22 : బతుకమ్మ వేడుకలను నిర్మల్ పట్టణంలో ఆదివారం కనుల పండువగా జరుపుకున్నారు. పట్టణంలోని శాస్త్రీ నగర్, బాగులవాడ, బంగల్‌పేట్ వాడలతో పాటు స్థానిక శాస్త్రి నగర్ కాలనీలోని దేవేందర్ మల్టీ స్పెషాలిటీ దవాఖాన వైద్యులు, సిబ్బంది, ఇతర వార్డుల్లో మహిళలు చిన్నారులు, రంగు రంగు పూలతో బతుకమ్మలను పేర్చి కోలాటం, నృత్యాలు చేశారు. అనంతరం స్థానిక చెరువుల్లో బతు కమ్మలను నిమజ్జనం చేశారు.

# ఆకట్టుకుంటున్న బీఆర్ఎస్ ప్రచార రథం

కుభీర్, అక్టోబర్ 22 : ముథోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డిగారి విఠల్‌రెడ్డి తన ప్రచారాన్ని మండ లంలోని సిర్పెల్లి (3) గిరిజన తండా (ఫకీర్ నాయక్ తండా) నుంచి ప్రారంభించారు. కాగా కుభీర్ మీదు గా సిర్పెల్లి తండా 1, 2, విలేజ్‌లో ప్రధాన వీధుల గుండా బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి ప్రచార రథం కదిలింది. పల్లె పదాల పాటలు, కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమంపై రూపొందించిన పాటలతో గ్రామాల్లోకి చేరుకున్న రథం ప్రజలు, యువకులను ఆకట్టుకుంటున్నది. నాయకులు తెలంగాణ అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరిస్తున్నారు.



బీఆర్ఎస్ ప్రచార రథం